అతివలకు అండగా స్త్రీ నిధి

మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక స్వావలం బన దిశగా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా అమలు చేస్తున్న స్త్రీ నిధి చేయూతనిస్తోంది. మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు తోడ్పాటుగా ఉంటోంది. తమ కాళ్లపై తాము నిలబడి, కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండేలా స్వల్ప వడ్డీతో అధిక ప్రయోజనం పొందుతు న్నారు. సుజాతనగర్ మండలంలోని పలు స్వయం ఉపాధి సంఘాలకు చెందిన మహిళ లు స్త్రీనిధి రుణాలు అందుకున్నారు.

- మహిళా సంఘాల సభ్యులకు రుణాలు
- స్వల్ప వడ్డీతో అధిక ప్రయోజనం


స్త్రీనిధి ద్వారా మంజూరైన రుణంతో హోటల్ నడుపుతున్న దండు కోటేశ్వరి

సుజాతనగర్: స్త్రీనిధి పథకం ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు తీసుకుంటున్న మహిళలు గ్రామీణ ప్రాంతాల్లో కుటీర పరిశ్రమలు, వ్యాపారాలు పెట్టుకొని ఆర్థిక స్వావలంబన సాధిస్తూ కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. మండలంలో 669 మహిళా సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 6,500 మంది సభ్యులు ఉన్నారు. 2021–22 ఆర్థిక సంవత్సరానికి గాను 4.90 కోట్ల రుణాలను అందించాలనే లక్ష్యం పెట్టుకోగా లక్ష్యం కంటే అదనంగా 6.43 కోట్ల రుణాలను (131 శాతం) ఆయా సంఘాలకు ఇచ్చారు. మండలంలోని బేతంపూడి, డేగలమడుగు, గరీబ్‌పేట, కోమటపల్లి, కోయగూడెం, లక్ష్మీదేవిపల్లి, నరసింహాసాగర్, నాయకులగూడెం, కొత్త అంజనాపురం, నిమ్మలగూడెం, పాత అంజనాపురం, రాఘవాపురం, సర్వారం, సీతంపేట, సీతంపేట బంజర, సింగభూపాలెం, సుజాతనగర్ తదితర గ్రామ పంచాయతీల పరిధిలోని మహిళా సంఘాలకు రుణాలను అందించారు.

రుణాలతో ఆర్థిక చేయూత...

స్త్రీనిధి ద్వారా తక్కువ వడ్డీకే రుణాలను అందించడంతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. ఇప్పటికే గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా ప్రభుత్వం రుణాలను అందిస్తోంది. కాగా వాటిని సక్రమంగా వినియోగించుకొని సకాలంలో బ్యాంకులకు తిరిగి చెల్లించడం, రికార్డులను నిర్వహించడం వల్ల మహిళా సంఘాలకు ఎన్ని రుణాలైనా ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకొస్తున్నాయి. స్త్రీనిధి ద్వారా మహిళలు కోరుకున్న ప్రదేశంలోనే వ్యాపార విస్తరణకు రుణాలు అందిస్తున్నారు.


కిరాణా దుకాణంతో స్వయం ఉపాధి పొందుతున్న మహిళ

కుటీర పరిశ్రమలు, దుకాణాలు, వాటర్ ప్లాంట్లు, ఇస్తర్ల తయారీ, జిరాక్స్ సెంటర్లు, బట్టల షాపులు, హోటల్స్, సెంట్రింగ్, ఆటోలు, ఫుట్‌వేర్ దుకాణాలు, ప్లాస్టిక్ సామగ్రి, టైలరింగ్, మేకలు, గొర్రెలు పెంపకం తదితర యూనిట్లను ఎంపిక చేసుకొని ఉపాధి పొందుతున్నారు.

కిరాణా దుకాణంతో ఉపాధి



స్త్రీనిధి రుణం ద్వారా గత సంవత్సరం 50 వేల రుణం తీసుకున్నాను. గ్రామంలో కిరాణా దుకాణం పెట్టుకున్నాను. షాపు ఆలోచన వచ్చినప్పుడు అప్పు ఎక్కడ దొరుకుతుందోనని ఆలోచించాను. ఈ సమయంలో మహిళా సంఘాలకు రుణాలు ఇస్తున్నారని తెలిసి దరఖాస్తు చేసుకున్నాను. తక్కువ వడ్డీకే రుణం మంజూరైంది.

– పి.ఉషారాణి, నాయకులగూడెం

ప్లాస్టిక్ సామాన్లు అమ్ముతున్నాం



12 ఏళ్లుగా డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. నా భర్త ప్లాస్టిక్ సామానులు అమ్ముతుంటాడు. గ్రామ దీపిక ద్వారా స్త్రీనిధి రుణం వస్తుందని తెలుసుకున్నాను. రూ.లక్ష రుణంగా తీసుకున్నాం. ప్లాస్టిక్ సామాన్లు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాం. వీటితో పాటు కూల్ డ్రింకులు, వాటర్ బాటిళ్లు కూడా విక్రయిస్తుంటాం.

– దండు పుష్పావతి, నాయకులగూడెం

సద్వినియోగం చేసుకోవాలి



మండలంలో గత సంవత్సరం లక్ష్యం కంటే ఈ ఏడాది అదనంగా రుణాలు మంజూరయ్యాయి. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించిన గ్రూపులకు అదనంగా రుణాలు మంజూరు చేసేలా కృషి చేస్తున్నాం.

– ఎండీ మీరాంబి, ఏపీఎం

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తెస్తాం


మాణిక్‌రావు ఠాక్రేతో నాగా సీతారాములు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి, పూర్వ వైభవం సాధించే దిశగా పార్టీ నాయకత్వం కార్యాచరణ రూపొందించిందని టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమీక్ష సమావేశంలో నాగాసీతారాములు పాల్గొన్నారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిస్థితులను రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్యరావు ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నాయకులు భట్టి విక్రమార్కలకు వివరించినట్లు పేర్కొన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి గురించి వివరించినట్లు తెలిపారు. ఈ నెల 26 నుంచి 'హాత్ సే హాత్ జోడో'యాత్ర నిర్వహిస్తున్నట్లు రేవంత్‌రెడ్డి చెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రెండు నెలల పాటు పాదయాత్ర ఉంటుందని చెప్పారని, భద్రాచలం నుంచి రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క పాదయాత్ర ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా పాదయాత్ర, బైక్ ర్యాలీ తదితర కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టబోతున్నట్లు వివరించారు. కొత్తగూడెం నియోజకవర్గంలోని కాంగ్రెస్ సత్తా.. రాష్ట్ర, జాతీయ నాయకులకు తెలిసేలా, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటే విధంగా ప్రణాళికలు రచించినట్లు మాణిక్‌రావు ఠాక్రే తెలిపినట్లు పేర్కొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ


చుంచుపల్లి: క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న సీపీఓ శ్రీనివాసరావు


సింగరేణి(కొత్తగూడెం): క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న సింగరేణి డైరెక్టర్లు, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో అన్ని సంఘాలకు సమ ప్రాధాన్యం ఇస్తుందని, సంస్థలో అన్ని మతాల వారు సోదరభావంతో కలిసి, మెలసి సంస్థ నిర్దేశించిన లక్ష్యాన్ని సాధిస్తూ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే అందరి ధ్యేయమని సింగరేణి డైరెక్టర్లు ఎస్.చంద్రశేఖర్, ఎన్.బలరామ్, డి.సత్యనారాయణరావు అన్నారు. శనివారం రాత్రి కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలోని డైరెక్టర్ చాంబర్‌లో సింగరేణి బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. డైరెక్టర్లు మాట్లాడుతూ.. సంస్థలో అందరిది ఒకే కులం.. అదే మానవ కులం అని, మనమందరం సంస్థలోని కుటుంబ సభ్యులమని ఎవరూ ఎక్కువ, ఎవరూ తక్కువ కాదన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, సింగరేణి బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..


ఇల్లెందురూరల్: క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: స్పర్శ తెలంగాణ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్ ఆవిష్కరించారు. సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ ఆల్మైటీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కనకయ్య మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పేదల ఆరోగ్య పరిరక్షణకు అహర్నిశలు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న గ్రామీణ వైద్యులు ధన్యులని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పానకంటి ఉపేందర్‌రావు, జిల్లా అధ్యక్షుడు కొమరం రామారావు, ఉపాధ్యక్షుడు యనగంటి గణేష్, సతీష్‌నాయుడు, హనుమంతు నాయక్, కూరాకుల హరీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

చుంచుపల్లి: కొత్తగూడెం కెమిస్ట్ భవన్‌లో ఆదివారం తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను జిల్లా ప్రణాళికా శాఖ అధికారి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మశాలి ఉద్యోగులు తమవంతు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. డీఐఓ సుశీల్ కుమార్, కొత్తగూడెం తహసీల్దార్ రామకృష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంజి రామ్మోహన్, అనంతుల లక్ష్మీనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న నాగరాజు, అరుణ దంపతులు

పాల్వంచరూరల్: మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి భద్రాచలానికి చెందిన కలకట్ల నాగరాజు, అరుణ దంపతులు రూ.30,016 విరాళం అందజేసినట్లు ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి ఆదివారం తెలిపారు. విరాళాలు అందజేసిన భక్తులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు.

వలస కూలీలకు దుస్తుల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న శ్రీరామ్

జూలూరుపాడు: సేవా భారతి ఆధ్వర్యంలో అనంతారం గ్రామంలో ఆదివారం వలస కూలీలకు దుస్తులు పంపిణీ చేశారు. మిర్చి కోతలకు వచ్చిన ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్రలకు చెందిన 300 మంది వలస కూలీలకు రూ.5 లక్షల విలువ గల చీరలు, పాయింట్లు, షర్ట్‌లు, పిల్లలకు డ్రస్‌లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సేవా ప్రముఖ్ సోడే శ్రీరామ్, స్థానిక వీఆర్‌ఏ ఈసం ప్రసాద్, వజ్జా బేబి, ప్రేమలత, తెల్లం మహేష్, బొర్రా సుధీర్, వాసు ఉన్నారు.

'పది' విద్యార్థులకు మెటీరియల్ అందజేత



మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

ఇల్లెందు: పట్టణంలోని గిరిజన సంక్షేమ హాస్టళ్ల, ఆశ్రమ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఆదివారం పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీఓ అప్పారావు చేతుల మీదుగా ఆల్ ఇన్ వన్, స్కేల్, పెన్నులు, కంపాక్స్, ప్యాడ్‌లు, క్యాలిక్యులేటర్స్, కేరీర్ గైడ్స్, మ్యాప్, లాంగ్ నోట్‌బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో ఏటీడీఓ రూపాదేవి మాట్లాడుతూ.. విద్యార్థులు వచ్చే వార్షిక పరీక్షల్లో సత్తా చాటాలని కోరారు. ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం విరంజి, వసంత, కోటేశ్వరి, ఎంపీ నాయక్, సుశీల, సునిత, వినోద, కుసుమ, రాము, శివాజీ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాణిక్‌రావు ఠాక్రేను కలిసిన కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడెంరూరల్: హైదరబాద్‌లోని గాంధీ భవనంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేను టీపీసీసీ ఉపాధ్యక్షుడు పోట్ల నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ఠాక్రేకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జేబీ శౌరి, మోతుకూరి ధర్మారావు, ఏనుగుల అర్జున్‌రావు, యల్లంకి వెంకటేశ్వరరావు, వీరాపురం రామలక్ష్మణ్‌రావు, కసనబోయిన భద్రం పాల్గొన్నారు.

ఇల్లెందు: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేను జిల్లా కాంగ్రెస్ నాయకులు చీమల వెంకటేశ్వర్లు, డాక్టర్ జి.రవి, డాక్టర్ బి.రాంచందర్ నాయక్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆయనను కలిసిన నేతలు పరిచయం చేసుకుని ఇల్లెందులో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

పరామర్శ

టేకులపల్లి: సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్‌నాయక్ ఆదివారం రాత్రి టేకులపల్లి మండలంలో పర్యటించారు. ఇల్లెందు నియోజకవర్గ పర్యటనలో భాగంగా.. తొమ్మిదో మైలుతండా గ్రామంలో ఇటీవల మృతి చెందిన టీచర్ తారాసింగ్ కుటుంబాన్ని పరామర్శించారు. టీచర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టేకులపల్లి పంచాయతీ మూడు తండాలో ఇటీవల మృతి చెందిన యువకుడు మూడు నవీన్ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మాళోతు శివ నాయక్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుండా అరెస్టులా?



టేకులపల్లి పోలీసు స్టేషన్‌లో మాట్లాడుతున్న హరిలాల్ నాయక్

టేకులపల్లి: జీఓ 317 బాధిత స్పౌజ్ ఉపాధ్యాయులు ఆదివారం హైదరాబాద్‌లో ప్రగతి భవన్ ముట్టడి చేస్తున్నారనే కారణంతో శనివారం సాయంత్రం తనను అరెస్టు చేసి టేకులపల్లి పోలీసుస్టేషన్‌లో నిర్బంధించడం అప్రజాస్వామికమని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అరెస్టులతో ఉద్యమాలను ఆపగలరా, ఆపితే ఎంత కాలం ఆపగలరని, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుండా ఉపాధ్యాయుల గొంతు నొక్కడ సరైంది కాదన్నారు. శనివారం హైదరాబాద్ డీఎస్‌ఈ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న బాధిత స్పౌజ్ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులపై దాడులు చేయడం, అక్రమ అరెస్టులకు పాల్పడటం దుర్మార్గం అన్నారు. ఉపాధ్యాయులకు సమయం ఇవ్వకుండా, ఆగమేఘాల మీద ఇచ్చిన జీఓ 317 బదిలీలలో భార్యాభర్తలు విడిపోయి చెరో జిల్లాలో పని చేస్తూ.. మానసికంగా కుంగిపోతున్న పరిస్థితిని ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం విడ్డూరం అన్నారు. అక్రమ అరెస్టులను ప్రజాస్వామ్య వాదులు, ఉద్యమ సంఘాలు ఖండించాలని కోరారు.

ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ల తనిఖీ

ఇల్లెందురూరల్: మండల, పట్టణ పరిధిలోని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్లను జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు ఆదివారం తనిఖీ చేశారు. జవహర్ స్కూల్, కాకతీయ స్కూల్, భారత్ స్కూళ్లలో నిర్వహిస్తున్న స్టడీ సెంటర్లలో తరగతుల నిర్వహణను పరిశీలించారు. క్రమం తప్పకుండా తరగతులకు హాజరుకావాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షలు బాగా రాసి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయా స్టడీ సెంటర్లలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్టడీ సెంటర్లకు పుస్తకాలు పంపిణీ చేశారు. రాంచందర్, రాజేందర్, మోహన్‌రావు, వెంకటస్వామి, అధ్యాపకులు ప్రభాకర్, నాయిని శ్రీనివాసరెడ్డి, రాము, ఈశ్వర్, రాజేశ్వరి పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యనందిస్తున్న 'సింగరేణి'


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

ఇల్లెందు: సింగరేణి పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు కల్పించి కార్పొరేట్ విద్యను అందిస్తున్నామని ఏరియా జీఎం షాలేము రాజు తెలిపారు. ఆదివారం జేకే సింగరేణి హైస్కూల్‌లో 47వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నామమాత్రపు ఫీజుతో ఉన్నత ప్రమాణాలు పాటించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుకున్నట్లు తెలిపారు. స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ, క్రీడల్లో, వైజ్ఞానిక ప్రదర్శనలో ఇతర పాఠశాలల కంటే ముందంజలో ఉన్నామని పేర్కొన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మోహన్‌రావు, సేవా అధ్యక్షురాలు మధుర వాణి, డీజీఎం శేఖర్‌బాబు, ఆనంద్, శ్రీహరి, కృష్ణ, సాయి స్వరూప్, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సుధాకర్, మేరీ, విష్ణుప్రియ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

కుల సంఘాల ఆత్మీయ సమ్మేళనాలు


ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న వాసం రామకృష్ణ


పాల్వంచరూరల్: ఐక్యత చాటుతున్న నాయకులు

ఇల్లెందురూరల్: మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం ఆదివాసీలు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆదివాసీ ఐకాస రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణ దొర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకునేందుకు ఆదివాసీలు ఐక్యంగా ఉండాలని కోరారు. జీఓ నం.3 పునరుద్ధరణకు సంఘం నిర్వహించే ఆందోళనలలో ఆదివాసీలు సమష్టిగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. పొడుగు రాంబాబు, పాయం ఆంజనేయులు, చీమల మల్లేష్, సూర్నపాక హనుమంతు, చీమల నరసింహారావు, ఊకే రఘు, పొడుగు విజయ, ఎట్టి శ్రీనివాసరావు, కంగాల వసంత్, ప్రవీణ్, పుల్లయ్య పాల్గొన్నారు.

పెరిక సంఘం ఆధ్వర్యంలో..

పాల్వంచరూరల్: మండల పరిధి యానంబైల్ గ్రామశివారులోని మామిడితోటలో ఆదివారం పురగిరి క్షత్రియ(పెరిక) సంఘం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ బరపటివాసుదేవరావు, మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, బుడగం మోహన్‌రావు, ఆకిరెడ్డి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ కమిటీ సభ్యుల ఎంపిక


రాజేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) జీఎం కమిటీ సభ్యులుగా బి.రాజేశ్వరరావును నియమించారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు బి.వెంకట్రావ్ నియామకపత్రం అందజేశారు. అదేవిధంగా ఇద్దరికి జీఎం కమిటీ సభ్యులుగా, మరో ఇద్దరిని బ్రాంచి కార్యదర్శుల తోపాటు, కిష్టారం ఓసీ పిట్ సెక్రటరీని నియమిస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు ఆదివారం విలేకులతో మాట్లాడుతూ.. యూనియన్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

నేడు కమిషనరేట్ ముట్టడి


ఆందోళన చేస్తున్న కార్మికులు

ఇల్లెందు: తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స్ డైలీవేజ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్‌ఏ నబీ కోరారు. ఆదివారం డైలీవేజ్ వర్కర్లను ఉద్దేశించి మాట్లాడుతూ.. రెండేళ్లుగా డైలీవేజ్ వర్కర్లు వేతనాలు లేక అల్లాడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఈసం పద్మ, జయ, విజయ, భారతి, శైలజ, దీప, సుజాత, భద్రమ్మ, సుధ, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

గణేష్‌టెంపుల్‌లో ప్రత్యేక పూజలు


పూజలో పాల్గొన్న భక్తులు

కొత్తగూడెంటౌన్: పట్టణంలోని శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం(గణేష్‌టెంపుల్)లో ఆదివారం ఈఓ కె. సులోచన ఆధ్వర్యంలో అర్చకులు మాఘమాసం పూజలు ఘనంగా నిర్వహించారు. నెలరోజులు ఈ పూజలు కొనసాగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తమ గోత్రనామాలు చెప్పి హోమం, పుష్పాభిషేకం, కుంకుమార్చన పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజల్లో రెనోవేషన్ కమిటీ సభ్యులు మేకల నాగబాబు, మోడెం మోహనరావు, భోగా రవికుమార్, తవ్వా వాణి రెడ్డి, సేవా సమితి సభ్యులు, అర్చక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పండిట్ పోస్టులు అర్హులకే కేటాయించాలి


మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: పండిట్, పీఈటీ పోస్టులను అర్హత కలిగిన వారికే కేటాయించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పండిట్, పీఈటీ జేఏసీ ఆధ్వర్యంలో బాబూ క్యాంపులోని ప్రభుత్వ పాఠశాలలో జరిగిన సమావేశంలో జేఏసీ నాయకులు మాట్లాడారు. పాఠశాలల్లోని పండిట్, పీఈటీ పోస్టులను ఇతరులకు కేటాయించడం వలన అర్హత కలిగిన వారు నష్టపోతున్నారని వివరించారు. ప్రభుత్వం ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఇంటికి వెళ్లి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాంసింగ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, గోపిచంద్, ప్రసాద్, కరీముల్లా, వీరన్న, నాగేశ్వరరావు, జయసుధ, శోభారాణి, స్వర్ణలత, రవికుమార్, వీరు తదితరులు పాల్గొన్నారు.

ఏడాదంతా నిత్యం జలధార..


కొప్పురాయి గ్రామంలో బోరులో నుంచి ఉబికి వస్తున్న నీరు


కోయగూడెం పంచాయతీ మేళ్లమడుగు రహదారిలో...

టేకులపల్లి: సింగరేణి అధికారులు బొగ్గు అన్వేషణ కోసం వేసిన బోర్లు రైతుల పాలిట వరంగా మారాయి. కోయగూడెం పంచాయతీ మేళ్లమడుగు రహదారిలో, కొప్పురాయి గ్రామంలో సుమారు 20 ఏళ్ల క్రితం బొగ్గు నిక్షేపాల కోసం డ్రిల్లింగ్ చేశారు. అక్కడ బొగ్గు లేకపోవడంతో బోర్లను అలాగే వదిలేశారు. ఓ సంవత్సరం తరువాత వాటి నుంచి నిత్యం జలధార పొంగి రావడం మొదలైంది. ఆనాటి నుంచి రైతులు నేటి వరకు ఆ నీటిని ఎటువంటి మోటారు అవసరం లేకుండా పంటపొలాలకు వాడుకుంటున్నారు. వీటిని భూగర్భశాఖ అధికారులు సందర్శించి ఈ ప్రాంతంలో భూమి లోపల నీటి ఒత్తిడి అధికంగా ఉండడం వల్ల భూపొరల్లో నుంచి నీరు ఉబికి వస్తున్నట్లు చెప్పారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా ప్రయాణం

సీతంపేట - సుజాతనగర్ మధ్య వంతెన నిర్మాణ పనులు తీవ్ర జాప్యం జరుగుతుండడంతో ఈ రెండు గ్రామాల మధ్య ప్రయాణం ప్రమాదకరంగా మారింది. గ్రామస్తుల అవసరాల మేరకు ఇక్కడ తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేశారు. ఈ రహదారి మొత్తం దుబ్బతో నిండుకొని ఉండటంతో వాహనాలు అదుపు తప్పి కిందపడిపోతున్నాయి. రోడ్డుకు రెండు వైపులా బ్రిడ్జి నిర్మాణానికి తీసిన లోతైన గుంతలు ఉండటంతో వాహనాలు అదుపు తప్పి తప్పతుందేమోనని ప్రయాణికులు భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. వంతెన నిర్మాణం సకాలంలో పూర్తిచేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. - సుజాతనగర్



ప్రశ్నించాల్సిన అధికారి : సత్యనారాయణ, పంచాయతీరాజ్ డీఈ
సెల్ నంబర్ : 9866722779